

# చిరిగిపోయిన నోటు

- యం.రమేష్‌కుమార్





"అవును.. ఈరోజే సరైంది. సాయంత్రంకల్లా అంతా అయిపోవాలి" ఒక నిశ్చయానికొచ్చినట్టు అనుకొన్నాడు హరి.

ఆ చిన్న రూమ్‌లో ఒక చిరుగులున్న చాపమీద కూర్చుని ఆలోచిస్తున్నాడతను. అతను ఆనుకొని వున్న దిండు మురికిపట్టిపోయి వుంది.

"రాజు, శేఖర్‌లు కూడా ఊరెళ్ళారు.. రేపు ఉదయానికి గానీ రారు.. అప్పటికి అంతా పూర్తయిపోతుంది."

తల్చుకుంటేనే హరికి మనసంతా ఉద్విగ్నంగా వుంది. తను చేసే పని తప్పే కావచ్చు.. కానీ ఇంతకన్నా గత్యంతరం ఏమీ కనిపించటంలేదు.

తనిక్కడకొచ్చి నాలుగు నెలలైంది. వచ్చినప్పుడు తండ్రి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.. "ఇప్పుడు నువ్వెళ్ళి జాయినయ్యేది చిన్న ఉద్యోగమే కావచ్చు- కానీ అక్కడుంటుండగానే మరో మంచి ఉద్యోగానికి ప్రయత్నం చేసుకోవడం మాత్రం మర్చిపోకు..."

తనిక్కడకొచ్చాక అర్థమైంది. తనకొచ్చింది ఓ బోగస్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం.. వాళ్లు నెల రోజులు పని చేయించుకొని జీతం ఇవ్వకుండానే జెండా ఎత్తేసారు.

శేఖర్ లేకపోతే తనేమైపోయేవాడు? అసలు వాడున్నాడన్న ధైర్యంతోనే తనిక్కడకొచ్చాడు. వాడి రూమ్‌లోనే వుంటున్నాడు. వాడిది కూడా ఓ చిరుద్యోగమే.. సంపాదన అంతంతమాత్రం. అందులోనే ఇంటికి ఎంతోకొంత పంపాలి. ఆమధ్యలో తనొకడు! రెండునెలలుగా రూమ్‌రెంట్‌కోసం గానీ, కనీసం తిండికోసం కూడా తనేమీ ఇవ్వలేకపోయాడు. కానీ శేఖర్ ఎప్పుడూ ఆమాటే ఎత్తలేదు. కానీ ఇలా ఎంతకాలం...?

ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో దొరికిన చిన్న వుద్యోగం రెండు నెలల తర్వాత కంపెనీ పరిస్థితే అంతంత మాత్రంగా వుండటంతో వూడిపోయింది. అప్పట్నుంచి ఖాళీ. ఎంత ప్రయత్నంచేసినా ఏ చిన్న వుద్యోగం దొరకలేదు.

ఇంటికి ఫోన్ చేసినప్పుడు వుద్యోగం చేస్తున్నట్టుగానే చెప్తున్నాడు. అయితే జీతం తక్కువని, వచ్చింది తనకే సరిపోవడం లేదనీ చెప్పుకొస్తున్నాడు. ఇంటి దగ్గరేమో నాన్న కష్టానికితోడు అమ్మ కూడా అప్పుడప్పుడు కూలికెళ్తేనే గానీ గడవని స్థితి. చెల్లెలు ఇంకా ఎయిత్ చదువుతోంది. ఇక్కణ్ణుంచి తనెంతోకొంత పంపిస్తే గానీ లాభం లేదు.. కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే ఇలా వుంది.

హరి జేబులో వున్న పది రూపాయల నోటు తీశాడు. తన దగ్గిర వున్న చివరి నోటు ఇదే.. అది కూడా బాగా నలిగిపోయింది. ఒక పక్కన కొద్దిగా చిరిగిపోయింది కూడా.. బహుశా చెల్లదేమో.. తనలాగే! తను కూడా ఎక్కడా చెల్లుబాటు కావడంలేదు. నోటు మళ్ళీ జేబులో పెట్టేశాడు.

తాడు సిద్ధంగానే వుంది. మధ్యాహ్నం రెండుగంటలవుతోంది. ఎక్కడా అలికిడి లేదు. పగటి నిద్ర అలవాటున్నవాళ్లు కాసేపు కునుకు తీసే సమయం. తాను ఉరి వేసుకుంటే బైటికి ఎప్పుడు తెలుస్తుంది? తలుపు లోపల గడియవేయకుండా ఉంచుతాడు. ప్రక్క వాటాలో వున్న ఇంటి ఓనర్ పరంధామయ్యకు రోజూ సాయంత్రం ఓసారి రూమ్‌కి వచ్చి కుర్రాళ్ళని పలకరించడం అలవాటు. బహుశా అప్పుడు తెలుస్తుంది!

ఒకవేళ ఆయన ఈరోజు రాకపోతే...? ఇంకెవరూ చూడకపోతే...? బహుశా రేపుదయం తన రూమ్మేట్స్‌లో ఎవరో ఒకరు వచ్చేవరకూ తన మరణం సంగతి తెలీకపోవచ్చు. హరి మనసులో రకరకాల ఆలోచనలు కదలాడుతున్నాయి.

'ఉరి వేసుకొంటే నొప్పిగా వుంటుందా? మెడ ఎముక విరిగిపోవడంవల్ల చనిపోతాడా? ఏది ఏమైనా తను మానసికంగా సిద్ధమైపోయాడు. ఎక్కువ ఆలస్యం చేస్తే మళ్ళీ తన ధైర్యం సడలిపోవచ్చు' హరి నెమ్మదిగా లేచి తాడు తీసుకొన్నాడు. స్టూల్ మీదెక్కి గది మధ్యలో వున్న సీలింగ్ ఫ్యాన్‌కి తాడు కట్టడం ప్రారంభించాడు. సరిగ్గా కట్టానని అనిపించాక స్టూల్ దిగి తాడుని పరీక్షగా చూశాడు. తాడు ఇప్పుడు ఉరితాడై సిద్ధంగా వుంది!

దేవుణ్ణి ప్రార్థించాలా.. అక్కర్లేదా? వచ్చే జన్మలోనైనా ఇలాంటి దరిద్రగొట్టు జీవితం కాకుండా కాస్త మంచి జీవితాన్నిమ్మని ప్రార్థిస్తే బాగుంటుందా? అయినా ఈ జన్మలో తన ప్రార్థన ఆలకించి తనకో ఉద్యోగం చూపించని దేవుడు వచ్చే జన్మ గురించి అర్జీపెట్టుకుంటే మాత్రం కరుణిస్తాడా?

హరి ఆలోచనలు సాగుతుండగానే తలుపు చప్పుడైంది. తలుపు గడియవేసి లేకపోవడంతో అది శబ్దం చేస్తూ తెరుచుకొంది. హరి గబుక్కున వెళ్ళి ఆ వచ్చిన మనిషి లోపలకు రాకముందే తనే తలుపుకడ్డంగా నిలబడ్డాడు.

వచ్చినవాడు ఇంటి ఓనర్ పరంధామయ్య. ఆయన మహా కంగారుగా వున్నాడు.. ఆయాస పడుతున్నాడు కూడా.

'బాబూ... నువ్వు అర్జెంటుగా రావాలి. మావాడు గన్నేరు పిక్కలు మింగాడు. హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి' వగరుస్తూ చెప్పాడు.

హరి టేబిల్ మీదున్న తాళం కప్పని ఒక్క ఉదుటున అందుకొని బైట తాళంపెట్టి ఆయనతోపాటు వెళ్ళాడు.

ఈలోపు ఎవరో ఆటో తీసుకొచ్చారు. కుర్రాణ్ణి ఆటోలో హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. ట్రీట్‌మెంట్ మొదలైంది.

'సరైన సమయంలోనే తీసుకొచ్చారు.. ప్రాణానికేమీ ఫర్వాలేదని' చెప్పాడు డాక్టరు.

పరంధామయ్య ఏకైక సంతానం రవి. ఆ కుర్రాడు ఇప్పటికే రెండుసార్లు ఇంటర్ తప్పాడు. ఈసారి ఫెయిలయితే ఇంటినుండి గెంటేస్తానని వార్నింగిచ్చాడు పరంధామయ్య. అప్పటికింకా ఇంటర్ రిజల్ట్సు రాలేదు.. కానీ ఈసారి కూడా తాను పాసవ్వననే అనుమానంతో మనోవేదన పెరిగిపోయి ఆత్మహత్యకి పాల్పడ్డాడు రవి.

కుర్రాడికింకా తెలివి రాలేదన్న టెన్షన్‌లో వుండి తన పరిస్థితి గురించే మర్చిపోయాడు హరి.

సాయంత్రం రవికి తెలివి వచ్చింది. పరంధామయ్య, హరి ఇద్దరూ లోపలకు వెళ్ళారు. ఒక అరగంట గడిచేసరికి రవి కాస్త తేరుకున్నాడు. పరంధామయ్య హరిని బైటకు పిల్చి "నాకు మాట రావడంలేదు.. వాడితో మాట్లాడాలంటేనే భయంగా వుంది.. వాడు ఇంటర్ పాసవ్వకపోయినా ఫర్లేదు.. చదువుమానేసినా ఫర్లేదు.. మాకున్నది ఒక్కడు.. బ్రతికి బాగుంటే ఏ వ్యాపారంలోనో పెడతాను. నువ్వే కాస్త వాడికి చెప్పు బాబూ" అర్థించాడు.

హరి లోపలకు వెళ్ళాడు.

"ఇంటర్ పాసవ్వలేననే కదూ ఈ పిచ్చి పని చేశావు?" రవి మంచం పక్కనే కూర్చుంటూ అడిగాడు.

రవి ఏం మాట్లాడలేదు.

"మీ నాన్న కోపంలో ఏదో ఓ మాటంటే దాన్ని పట్టుకొని ఇంత పని చేస్తావా?" ఏం.. ఇంటర్ పాసవ్వకపోతే మరింక జీవితం లేదా? అయినా ఒక్కగానొక్క కొడుకువి. నీకేం తక్కువని ఇలాంటి పనికి దిగావు? నువ్వు ఛస్తే మీ అమ్మానాన్నల గతేంటని ఆలోచించావా? హరికి

ఎంత ప్రయత్నించినా కోపం దాగలేదు.

ఆ కుర్రాడు తప్పుచేసినట్టుగా పక్కచూపులు చూడ సాగాడు.

బైటికి వచ్చాక గుర్తొచ్చింది హరికి. అసలు తనేపరిస్థితుల్లో వచ్చాడిక్కడికి? నిజానికి ఈ కుర్రాడు ఆత్మహత్యాయత్నం చేసుండకపోతే ఈపాటికి తను పైకి పోయుండేవాడు. అసలు రవికి బుద్ధిచెప్పడానికి తనకేం అర్హత వుంది? తను మాత్రం తల్లిదండ్రుల గురించి ఆలోచించాడా?

"నువ్వు కూడా అదే పని చెయ్యబోయావుగా.. ఏం.. ఉద్యోగం దొరక్కపోతే చావేగతా? చిన్న కుర్రాడికి బుద్ధులు చెప్తున్నావు.. మరి నీ బుద్ధి ఏమైంది?" లోపల్నుంచి మనస్సాక్షి నిలదీస్తోంది.

బరువెక్కిన హృదయంతో రూమ్‌కి చేరుకొన్నాడు హరి. తాళం తీసి లోపలకు వెళ్ళి లోపల గడియపెట్టుకొని గోడకు జేరబడి కూర్చున్నాడు. సాయంత్రం ఏడు దాటింది.

అతడి మనసులో సంఘర్షణ జరుగుతోంది. తన సమస్యకు చావే పరిష్కారమా? రవికి వాడి సమస్య పెద్దది. తనకు తన సమస్య పెద్దది. రవికి ఏ సమస్య లేకుండా చూసుకోవడానికి వాళ్ల నాన్న వున్నాడు. మరి తనకెలా..? ముందు ముందు తనే తల్లిదండ్రుల్ని చూసుకోవాల్సి వుంది.

హరి మనసులో ఏవేవో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. జీవితంలో ఎన్నో కోల్పోతుంటాం.. కానీ బ్రతుకు పట్ల నమ్మకాన్నే కోల్పోతే..? ఇంక జీవితమే లేదు..

హరి లేచి నిలబడ్డాడు. అతడి మొహంలో ఏదో స్థిరత్వం.. సీలింగ్ ఫ్యాన్‌కి కట్టిన తాడు విప్పదీసి రూమ్ వెనకవైపున్న పెరట్లోకి విసిరేశాడు. జేబులోనుండి చిరిగిపోయిన నోటు తీశాడు. రూమ్‌లో ఎక్కడో సెలోఫిన్ టేపు వుండాలి.. ఎక్కడది..? వెతికాడు.

టేపు దొరికింది. దాంతో జాగ్రత్తగా ఆ నోటుని అతికించాడు. దాన్ని చేత్తో పామి సాపు చేశాడు. ఇప్పుడా నోటు బాగానే వుంది. చిరిగి పోయిందని ఎవరూ కనుక్కోలేరు.. అది చెల్లుతుంది కూడా..!

హరి శుభ్రంగా మొహం కడుక్కొని ఫ్రెష్ అయ్యాడు. పది రూపాయల నోటు జేబులో పెట్టుకొని రూమ్ తాళం పెట్టి బైటికి నడిచాడు. ఉదయం, మధ్యాహ్నం ఏమీ తినకపోయినా ఇప్పటివరకూ ఆకలి సంగతే తెలీ లేదు. ఇప్పుడు మాత్రం కరకరా ఆకలి వేస్తోంది.

బస్ కాంప్లెక్స్ వెనకవైపున రోడ్డుకు అవతలి ప్రక్క ఒక బండి మీద భోజనం అమ్ముతుంటారు. ప్లేటు భోజనం పది రూపాయలు మాత్రమే. అన్నం, సాంబారు, ఒక కూర వేసి పెడతారు. రుచి కూడా బాగుంటుంది. హరి గబగబా నడుస్తూ అక్కడకు చేరుకొన్నాడు.

పది రూపాయల నోటు ఇచ్చి ఓ ప్లేటు భోజనం తీసుకొన్నాడు. వేడి వేడి భోజనం.. అసలే ఆకలి మీదున్నాడేమో మరీ రుచిగా అన్పించింది.

**అతడి మనసులో సంఘర్షణ జరుగుతోంది. తన సమస్యకు చావే పరిష్కారమా? రవికి వాడి సమస్య పెద్దది. తనకు తన సమస్య పెద్దది. రవికి ఏ సమస్య లేకుండా చూసుకోవడానికి వాళ్ల నాన్న వున్నాడు. మరి తనకెలా..?**

కడుపు నిండడంతో హరికి మనసులోకి కొత్త శక్తి వచ్చినట్టుగా అన్పించింది. నలిగి చిరిగి పనికి రాదేమో అనుకున్న నోటు కడుపు నిండా భోజనం పెట్టించింది. తను మాత్రం చెల్లుబాటు కానివాడిగా ఎందుకు భావించుకోవాలి? హుషారుగా అడుగులు వెయ్యసాగాడతను.

కాస్త దూరంలో వున్న సాంబయ్య టీ కొట్టు వైపు నడిచాడు. చిన్న రేకుల షెడ్‌లో సాంబయ్య ఉదయం, సాయంత్రం టీ, టిఫిన్ అమ్ముతుంటాడు. అక్కడ టిఫిన్ బాగుండటంతో ఎప్పుడూ ఆ కొట్టు రద్దీగానే వుంటుంది. చాలామంది అటుగా వెళ్ళే ఉద్యోగులు కూడా అక్కడ ప్లేటు పట్టుకొని నిలబడి టిఫిన్ చేసి వెళ్తుంటారు. ఆ సెంటర్లో సాంబయ్య టీ కొట్టంటే ఫేమస్. హరికి అప్పుడప్పుడూ అక్కడకు వెళ్ళి కాసేపు కూర్చుని సాంబయ్యతో పిచ్చాపాటీ మాట్లాడ్డం అలవాటు.

"ఏం బాబూ.. బాగున్నావా.. నాల్రోజులుగా ఇటు రావడమే మానేశావు.." హరి చూస్తూనే అన్నాడు సాంబయ్య.. చదువుకున్న వాళ్లంటే అతనికెంతో గౌరవం.. ఉద్యోగం దొరక్క తిప్పలు పడుతున్న హరిని- చూస్తే సానుభూతి.

హరి నవ్వి అక్కడ బెంచీ మీద కూర్చున్నాడు.

"సాంబయ్యా.. పనికుర్రాడు మానేశాడు. ఎవరైనా వుంటే కావాలన్నావు. ఎవరైనా కుదిరారా?" అడిగాడు.

'లేదు బాబూ.. అదే చూస్తున్నాను. కొట్లో చాలా అవస్థగా వుంది. క్లీనింగుకి ఓ కుర్రాడున్నాడు. టిఫినందించడానికి ఎవరూ లేక నేనే తిప్పలు పడుతున్నాను. కుర్రాడు దొరికితే బాగుణ్ను. ఏరోజు డబ్బులు ఆరోజే ఇచ్చేస్తాను. రెండుపూటలా టిఫిన్ ఫ్రీ. మీ ఎరికలో ఎవరైనా వుంటే చెప్పండి బాబూ..'

"వున్నాడు.. అందుకే అడిగాను.. నేను చెప్పిన కుర్రాణ్ణి కాదనకుండా పెట్టుకుంటానని మాటిస్తే చెబుతాను.."

"అదేంమాట బాబూ.. మీరు తీసుకొచ్చేవోడిపై నాకెందుకు అనుమానం? ఎవరైనా వుంటే రేపణ్నుంచే పన్లోకి వొచ్చెయ్యమనండి బాబూ.." సాంబయ్య అర్థింపుగా అన్నాడు.

"రేపట్నుంచి కాదు.. ఈరోజునుంచే పన్లోకి చేరితే నీకేమైనా అభ్యంతరమా?"

"ఈరోజు నించా? ఎవరు బాబూ.. ఎక్కడున్నాడా కుర్రాడు?"

"ఎక్కడో కాదు సాంబయ్య.. నేనే. నీ కొట్లో పనిచేద్దామనుకుంటున్నాను. ఇప్పట్నుంచే జాయినవుతున్నాను.. నీకిష్టమేనా?"

"అదేంటి బాబూ.. మీరా..? మీరు నా కొట్లో..?" సాంబయ్యలో ఆశ్చర్యం!

"మరేం మాట్లాడకు.. చేర్చుకుంటానని నాకు మాటిచ్చావు.. కుర్రాడికి నువ్వెంత ఇవ్వాలనుకున్నావో నాకూ అంతే ఇవ్వు చాలు.. ఒక్క రూపాయి కూడా ఎక్కువొద్దు..." కొట్లోకి నడుస్తూ అన్నాడు హరి.

ఆ విధంగా అతని కొత్త వుద్యోగం ఖరారైంది.

ఆరోజుకి పని పూర్తయి కొట్టు మూసేశాక బైటికి వచ్చాడు హరి. అతని మనస్సిప్పుడు ప్రశాంతంగా వుంది.

"నాన్నా ముందు చిన్న వుద్యోగంలో చేరినా మరో మంచి వుద్యోగం వెతుక్కోమని చెప్పావు. ఆ చిన్న వుద్యోగం ఏదైనా కావచ్చు కదా అన్న ఆలోచన నాకు రాలేదు. అందుకే దాన్ని కనుక్కోవడంలోనే కాస్త ఆలస్యమైంది. ఇక ఫర్వాలేదు.. ఆత్మహత్య గురించి ఆలోచించే అవసరం మళ్ళీ రాదు." రూమ్‌వైపుగా నడుస్తూ అనుకొన్నాడతను.. అతని జేబులో ఆ పూట పనిచేసినందుకు సాంబయ్య చిల్లర రూపంలో ఇచ్చిన డబ్బులు గలగల్లాడుతూ ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నాయ్. ★

**రచయిత చిరునామా:**
**ఎం.రాజేష్‌కుమార్,**
దేవాంగుల వీధి, ఇంటి నెం.26-160,
నెల్లిమర్ల- 535217. విజయనగరం జిల్లా.

